క్లుప్తంగా

నీలంపాటి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: గోగులపాడులోని నీలంపాటి అమ్మవారి దేవాలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం వేళ అమ్మవారి జెండా, బొల్లి ఆవు, కుంకుమ బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి భజన కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు అధికారుల ప్రత్యేక సమావేశం

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఈనెల 6న చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నందున ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులు, వెలుగు, ఉపాధి హామీ పథకం, హెల్త్ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

నేడు పెన్షన్ల పంపిణీ

నాదెండ్ల: వైఎస్సార్ పెన్షన్ కానుక సామాజిక భద్రతా పెన్షన్లను సోమవారం పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు, వరుస బ్యాంకు సెలవులు కావటంతో 1న జరగాల్సిన పెన్షన్ల పంపిణీ వాయిదా పడింది. సోమవారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించనున్నారు.

అనాథ బాలలకు చేయూత

శావల్యాపురం: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్‌షిప్ కార్యక్రమాన్ని అనాథ బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత ఆదివారం తెలిపారు. శ్రీలత మాట్లాడుతూ అనాథ బాలలు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన వారు, పేదరికంతో పెద్దలను కోల్పోయిన 18 ఏళ్లలోపు వారికి వాత్సల్య పథకం వర్తిస్తుందని చెప్పారు. నెలకు రూ.4వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్, రైస్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో వినుకొండ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి

శావల్యాపురం: స్త్రీనిధి రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఆర్థిక ప్రగతి సాధించాలని స్త్రీనిధి మేనేజర్ రంతు చిన బుల్లెయ్య ఆదివారం తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గంలోని 5,700 మంది సభ్యులకు రూ.20 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 4,435 మందికి రుణాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. రికవరీ 98.04 శాతంగా ఉందని వివరించారు. దీర్ఘకాలిక బకాయిలు 0.80 శాతం ఉన్నాయని చెప్పారు. శావల్యాపురం మండలంలో 980 మంది సభ్యులకు రూ.5 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి ప్రథమ స్థానంలో నిలిచినట్టు వెల్లడించారు.

శుభ్రమస్తు


నాడు
బరంపేటలోని బజార్‌లో పిచ్చిమొక్కలు


నేడు
పిచ్చిమొక్కలు, చెత్త తొలగించిన తర్వాత ఇలా..


నాడు
31వ వార్డులోని కత్తవ మురుగు డ్రెయిన్‌లో చెత్త


నేడు
కత్తవ డ్రెయిన్‌లో చెత్త తొలగించిన తర్వాత ఇలా..

పట్టణ పరిశుభ్రత కోసం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోంది. వారానికి రెండు రోజులు ఆయన ద్విచక్రవాహనంపై అధికారులతో కలిసి పట్టణంలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థితులపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు. స్వచ్ఛ నరసరావుపేట కోసం కృషి చేస్తున్నారు. ప్రధానంగా చెత్తా, చెదారం, పిచ్చిమొక్కలతో నిండిన వీధులు, డ్రెయిన్ల పరిశుభ్రతకు నడుంకట్టారు. ఫలితంగా పట్టణంలోని పలు డ్రెయిన్లు, వీధుల స్వచ్ఛీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనికి ఈ చిత్రాలే సాక్ష్యాలు. - నరసరావుపేట

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దాం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


ఎమ్మెల్యే గోపిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు గాదె రామిరెడ్డి

రొంపిచర్ల: రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు, గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈనెల 7న ముఖ్యమంత్రి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. ఆ రోజు నుంచి వలంటీర్లు, గృహసారథులు తమ పరిధిలోని 50 ఇళ్లను సందర్శించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని తెలుసుకోవాలన్నారు. ప్రతి గృహానికి కనీసం పావుగంట కేటాయించాలన్నారు. ఆ ఇంటి యజమాని చేత పుస్తకంలో సంతకం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంపై నాయకులు, ప్రజాప్రతినిధులను సంప్రదించాలన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని సూచించారు. గృహసారథులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ వెంకట్రావు, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, జిల్లా విభజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు గాదె రామిరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, మేడికొండ శ్రీనివాసరెడ్డి, గుండాల వెంకటేష్, బత్తుల రామకృష్ణ, కొరెడ్డి వెంకట కోటిరెడ్డి, కల్లం శివారెడ్డి, గజ్జల ముసలారెడ్డి, కర్నాటి కృష్ణమూర్తి, గెల్లి చినకోటిరెడ్డి పాల్గొన్నారు.

జయ యేసు.. శుభ క్రీస్తు


తిమ్మాపురం లూథరన్ చర్చి వద్ద మట్టలతో ర్యాలీగా వస్తున్న బాలలు


శావల్యాపురంలోని విమోచన ప్రార్థన మందిరం వద్ద మట్టల ఆదివారం వేడుకల్లో పాల్గొన్న భక్తులు


చిలకలూరిపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

యడ్లపాడు/శావల్యాపురం/చిలకలూరిపేట టౌన్: చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల్లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే పొలం గట్లకు వెళ్లి ఈతచెట్ల కొమ్మల్ని తెచ్చి వాటి చిగుళ్లకు రకరకాల పూలు గుచ్చి అందంగా సిద్ధం చేశారు. ఈ మట్టలతో వీధుల్లో ప్రదర్శనలు చేపట్టారు. హోసన్నా గీతాలతో యేసుక్రీస్తుకు జయజయధ్వానాలు చేశారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తిమ్మాపురం లూథరన్ చర్చి పాస్టర్ గేరా ఆనందప్రతాప్ క్రీస్తు సందేశం వినిపించారు.

- శావల్యాపురం విమోచన ప్రార్థన మందిరంలో భక్తులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సి.హెచ్.యెహెజ్కేలు క్రీస్తు సందేశం వినిపించారు. అనంతరం భక్తులు ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు.
- చిలకలూరిపేట పట్టణంలో చిన్నారులు ఈత మట్టలతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సాంబశివనగర్‌లోని సియోను ప్రార్థనా మందిరం, సంజీవనగర్, వెంగళరెడ్డినగర్, తూర్పు మాలపల్లె చర్చిల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మట్టల ఆదివారం ప్రాముఖ్యాన్ని వివరించారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి

డీఎస్‌ఏ స్టేడియంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు


మాట్లాడుతున్న మహాత్మాగాంధీ సమాఖ్య నాయకురాలు ఫాతిమా, వార్డు ఇన్‌చార్జిలు

నరసరావుపేట: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషిచేస్తున్నారని మహాత్మాగాంధీ పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సయ్యద్ ఫాతిమా పేర్కొన్నారు. ఆదివారం సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు మహాత్మాగాంధీ పట్టణ మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఫాతిమా మాట్లాడుతూ మూడో విడత రుణమాఫీ ద్వారా ఒకటో వార్డుకు రూ.26.73 లక్షలు, 32వ వార్డుకు రూ.22.10 లక్షలు, 33వ వార్డుకు రూ.37.07లక్షలు, 34వ వార్డుకు రూ.29.92 లక్షలు వైఎస్సార్ ఆసరా ద్వారా ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి మెప్మా సీఎంఎం ఉమర్, ఒకటో వార్డు ఇన్‌చార్జి వాసంతి, 32వ వార్డు ఇన్‌చార్జులు ముడియం శేషమ్మ, పుల్లంశెట్టి శ్రీనివాసరావు, కోటిరెడ్డి, షేక్ వజీద్, 33వ వార్డు ఇన్‌చార్జులు మర్రిపూడి రాంబాబు, కంచర్ల రామకోటేశ్వరావు, 34వ వార్డు మాజీ కౌన్సిలర్ సయ్యద్ మహబూబి, సీవో నూర్జహాన్, సమైక్య ఆర్పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అటవీశాఖ సిబ్బందికి వైద్యపరీక్షలు


వైద్యశిబిరంలో పాల్గొన్న అటవీశాఖ సిబ్బంది

నరసరావుపేట రూరల్: అటవీశాఖ సిబ్బందికి కోటప్పకొండలోని ప్రకృతి పర్యాటక కేంద్రంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు, అటవీ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు అటవీ సిబ్బందికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. జిల్లాలోని అటవీశాఖ కార్యాలయ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందికి వైద్యులు పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అటవీశాఖ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం జగన్


ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డ్వాక్రా మహిళలు

రొంపిచర్ల: ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో ఆయన మాట్లాడారు. గతంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని గద్దెనెక్కిన చంద్రబాబు మాట తప్పి మహిళలను మోసం చేశారని విమర్శించారు. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు అండగా నిలిచారని, ఇప్పటికే మూడు విడతల్లో రూ.19 వేల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారని పేర్కొన్నారు. ఇంకా రూ.6 వేల కోట్లను వచ్చే ఏడాది జమ చేస్తారని వెల్లడించారు. విలువలకు, విశ్వసనీయతకు కట్టుబడి ఉండే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. వెన్నుపోటుదారులకు గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. 1,088 డ్వాక్రా గ్రూపులకు రూ.9,07,29,340 ఆసరా చెక్కును అందించారు. 10,880 మందికి ప్రయోజనం చేకూరినట్టు వెల్లడించారు. అనంతరం 1,798 మంది మహిళలకు రూ.7,98,25,000 స్త్రీ నిధి రుణాలు అందించారు. ముందుగా డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, సర్పంచ్‌లు జయమ్మ, గాదె రామిరెడ్డి, పునుగోటి నాగేశ్వరరావు, గాడిపర్తి సీతయ్య, మానుకొండ వాసుదేవరెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, గెల్లి చిన కోటిరెడ్డి, యార్డు మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గానుగపంట ఉత్తమ్‌రెడ్డి, బత్తుల రామకృష్ణ, గుండాల వెంకటేష్, మేడికొండ శ్రీనివాసరెడ్డి, సపారపు సంజీవరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పునుగోటి వెంకట్రావు, ఎంపీడీఓ మాథ్యూబాబు పాల్గొన్నారు.


గొంతులో ఇరుక్కున్న చికెన్ ఎముక తొలగింపు


శస్త్రచికిత్స చేసిన తర్వాత వృద్ధురాలితో డాక్టర్, సిబ్బంది

నరసరావుపేట: ఓ వృద్ధురాలి గొంతులో ఇరుక్కుపోయిన చికెన్ ఎముకను పట్టణానికి చెందిన అశ్వార్ హాస్పిటల్ డాక్టర్ యండమూరి నిఖిలేష్ ఆదివారం విజయవంతంగా తొలగించారు. డాక్టర్ నిఖిలేష్ తెలిపిన వివరాల ప్రకారం నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన 80ఏళ్ల ఉప్పుటూరి లక్ష్మీ నరసమ్మ గత నెల 26న చికెన్ తిన్నారు. ఆ సమయంలో ఓ ఎముక ఆమె గొంతులో ఇరుక్కుపోయింది. దీంతో ఆమె గొంతునొప్పి, ఆయాసంతో బాధపడ్డారు. శనివారం డాక్టర్ నిఖిలేష్‌ను సంప్రదించారు. ఆమెను పరీక్షించిన డాక్టర్ గొంతులో ఎముకను గుర్తించి ఎండోస్కోపీ ద్వారా దానిని తొలగించారు. ఇటువంటి ఎముకల ద్వారా పేగుకు రంధ్రాలు పడే అవకాశం కూడా ఉంటుందని డాక్టర్ వివరించారు.

గాలివాన బీభత్సం


ఏనుగుపాలెం రోడ్డు మార్గంలో నేలవాలిన చెట్టు


వెల్లటూరు రోడ్డులో దెబ్బతిన్న దుకాణాలు

వినుకొండ (నూజెండ్ల): వినుకొండలో ఆదివారం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఫలితంగా జనజీవనం స్తంభించింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులు వీచాయి. భారీ వర్షం కురిసింది. రేకుల దుకాణాలు ధ్వంసమయ్యాయి. రైల్వే స్టేషను రోడ్డులో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. ఏనుగుపాలెం రోడ్డు మార్గంలో చింతచెట్లు, వేపచెట్ల కొమ్మలు విరిగిపోవటంతో అద్దంకి -వినుకొండ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఏనుగుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని జంగాలపల్లి, పెరుమాలపల్లె, గొల్లపాలెం తదితర గ్రామాలతోపాటు నూజెండ్ల మండలంలోని 10 గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వినుకొండ పట్టణంలోని 19, 20 వార్డుల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు


వివరాలు తెలుపుతున్న రూరల్ సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ రవికృష్ణ

శావల్యాపురం: పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వినుకొండ రూరల్ సీఐ ఎస్.రమేష్ బాబు చెప్పారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఆయన పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నూజెండ్ల మండలంలో 2, ఈపూరు మండలంలో 2, బొల్లాపల్లి మండలంలో 2, శావల్యాపురం మండలంలో ఒక పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సుమారు 2వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ఈ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వివరించారు. సీఐతోపాటు ఎస్సై గల్లా రవికృష్ణ ఉన్నారు.

అగ్నిప్రమాదం

నరసరావుపేట టౌన్: షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది కథనం ప్రకారం.. గుంటూరు రోడ్డులోని సబ్బా రాంబాబు తన గృహంలో టీవీ చూస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. టీవీతోపాటు గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయని ఎస్‌ఎఫ్‌ఓ ఎం.వి.సుబ్బారావు తెలిపారు.

బహిరంగ ప్రకటన

[illegible]

యం.చంద్రశేఖర్, న్యాయవాది, నరసరావుపేట. సెల్: 9440525300